దీపావళి ఎఫెక్ట్..

సొంతూళ్లకు లక్షలాదిమంది ప్రయాణం

రవాణా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వ సంస్థల కుస్తీ

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగరం నుంచి సుమారు 10 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వారికి రవాణా సదుపాయాలు కల్పించేందుకు నానా పాట్లు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా 11,000 ప్రభుత్వ బస్సులు, 10కి పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేశారు. ఈ నెల 31 దీపావళి నేపథ్యంలో చెన్నై, కోవై సహా పలునగరాల్లో నివసిస్తున్నవారు పండుగ జరుపుకొనేందుకు తమ స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు, ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. నగరం నుంచి ప్రతిరోజూ నడిపే 2,092 బస్సులతో పాటు అదనంగా 4,900 ప్రత్యేక బస్సులు కలిపి, మూడు రోజుల్లో మొత్తం 11,176 బస్ సర్వీసులు నడపనున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే ప్రైవేటు బస్సులను కూడా అద్దెకు తీసుకొని నడుపుతామని రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో మదురై, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, సెంగోట్టై, కోవై తదితర మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిరోజు నడిపే 2,500 బస్సులతో పాటు అదనంగా 1,000 బస్సులు నడుపుతామని ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం తెలిపింది. ఇవికాక, కార్లు, సొంత వాహనాల్లో వెళ్లేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు. రాజధాని నగరం నుంచే సుమారు 10 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లనున్నారని రవాణా శాఖ అంచనా వేస్తోంది. ఈ విషయమై రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపనున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించేలా కోయంబేడు, కిలాంబాక్కం, మాధవరం బస్ టెర్మినళ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు 1.08 లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్నారన్నారు. గత ఏడాది దీపావళి సందర్భంగా చెన్నై నుంచి ప్రభుత్వ బస్సుల్లో సుమారు 5 లక్షల మంది ప్రయాణం చేయగా, ఈ ఏడాది 5.82 లక్షల మంది వెళ్లే అవకాశముందని భావిస్తున్నామన్నారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... నగరం నుంచి యథావిధిగా వెళ్లే రైళ్లతో పాటు 40 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామన్నారు. రాజధాని నగరం నుంచి రైళ్ల ద్వారా 3 లక్షల మంది ప్రయాణించే అవకాశముందన్నారు. నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే వారు అధికంగా 28, 29 తేదీల్లో ప్రయాణించనున్నారు. అందరూ ఒకే సమయంలో వెళ్లకుండా, ఉదయం నుంచి ప్రయాణం చేస్తే రద్దీ తగ్గడంతో పాటు శ్రమ పడాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు.

మూడు రెట్లు పెరిగిన ఆమ్నీ బస్ ఛార్జీలు...

దీపావళి పండుగ సందర్భంగా ఆమ్నీ బస్సు ఛార్జీలు మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. చెన్నై నుంచి నాగర్‌కోయిల్‌కు సాధారణంగా రూ.585 నుంచి రూ.1,200 వరకు ఛార్జీ వసూలుచేస్తుండగా, దీపావళి సందర్భంగా ఈ నెల 29వ తేది రూ.2,110 నుంచి రూ.4,350 వరకు ఛార్జీ నిర్ణయించారు. అలాగే, కోవైకు రూ.800 నుంచి రూ.1,040 వరకు ఉండగా, పండుగ సందర్భంగా 29వ తేది రూ.1,800 నుంచి రూ.3,470కి పెంచేశారు. ఇక, మదురై, తిరుచ్చి, ఈరోడ్, సేలం, దిండుగల్ సహా పలు నగరాలకు సాధారణం కన్నా మూడు రెట్లు పెంచారు. ఛార్జీలు పెంచే ఆమ్నీ బస్సులను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటి పర్మిట్లు రద్దు చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నా, ఆమ్నీ బస్సుల యజమానులు వాటిని లక్ష్యపెట్టకుండా ఛార్జీలు భారీగా పెంచుకుంటూ పోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఈ వ్యవహారంపై జోక్యం చేసుకొని అధిక ఛార్జీలు వసూలు చేసే ఆమ్నీ బస్సుల యజమానులపై తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కూటమి కూలడమా..!?

● వివాదాలుండొచ్చు కానీ... చీలికలుండవ్

● పగటి కలలు కనొద్దు : ఈపీఎస్‌కు సీఎం స్టాలిన్ చురక



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం, మంత్రులు

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ కూటమిలో వివాదాలుండవచ్చని, అంతమాత్రాన కూటమి చీలిపోతుందని భావించొద్దని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. పైపెచ్చు గత కొన్ని రోజులుగా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి జ్యోతిష్యుడిగా మారిపోయారంటూ సెటైర్లు చేశారు. తేనాంపేటలోని డీఎంకే పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆశీర్వదించిన ప్రభుత్వంగా డీఎంకే సర్కారు సుపరిపాలన అందిస్తోందన్నారు. కానీ ప్రజ లు దూరం పెట్టిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పా డి తమ పాలనను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని, దీంతో ప్రభుత్వానికి నానాటికీ ఆదరణ పెరిగిపోతుందనే అక్కసు ఎడప్పాడిలో ఏర్పడిందన్నారు. దీనికితోడు డీఎంకే ఓటు బ్యాంకు గణనీయంగా పెరుగుతుంటే, ఎడప్పాడి సారథ్యంలోని అన్నాడీఎంకేకి ఓటు బ్యాంకు నానాటికీ తగ్గిపోతోందన్నారు. డీఎంకే కూటమికి బీటలు వారుతున్నాయని ఎడప్పాడి భావిస్తున్నారన్నారు. కానీ, ఇపుడు ఆయన నిజంగానే జ్యోతిష్యుడిగా మారిపోయారన్నారు. తమ పార్టీ ఎన్నికల కోసం ఆవిర్భవించిన కూటమి, పదవులు ఆశించిన ఏర్పడినది కాదన్నారు. తమది సిద్ధాంత పరంగా ఆవిర్భవించిన కూటమి అన్నారు. తమ కూటమిలో అనేక రకాలైన వివాదాలు, చర్చలు జరుగుతుంటాయని, అంతమాత్రాన కూటమికి బీటలు వారుతున్నాయని ఏ ఒక్కరూ భావించరాదన్నారు. వివాదాలు ఉన్నాయేగానీ, చీలికలు లేవన్నారు.

ఎడప్పాడికి ఆ ధ్యాస లేదు..

పొరుగింటిలో ఏం జరుగుతుందనే ఆసక్తి ప్రతి ఒక్కరికీ ఉండటం సహజమన్నారు. కానీ, ఎడప్పాడికి మాత్రం సొంత పార్టీ కంటే డీఎంకేలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువైందన్నారు. నానాటికీ క్షీణించిపోతున్న సొంత పార్టీని ఎలా బలోపేతం చేయాలన్న ధ్యాస లేకుండా, ప్రజల మధ్య మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. డీఎంకే విపక్ష పార్టీగా ఉన్న సమయంలో కూడా వర్ష బాధితులను ఆదుకున్నామన్నారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద ముంపు ప్రాంతాల్లో తనతో పాటు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, ఎంపీలు పర్యటించి బాధితులను ఆదుకున్నామన్నారు. కానీ, ఎడప్పాడి మాత్రం సేలం పారిపోయారని ఆరోపించారు. డీఎంకే కూటమి అంటే.. అది ఒక సిద్ధాంతపరమైనది మాత్రమే కాదు ప్రజాహితాన్ని కాంక్షించేదన్నారు. 2026లోనే కాదు ఆ తర్వాత జరిగే ఎన్నికల్లోనూ డీఎంకే విజయం సాధిస్తుందని స్టాలిన్ జోస్యం చెప్పారు.

మీవి పగటి కలలు

● సీఎంపై ఈపీఎస్ ఆగ్రహం



చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తనను కలలు కనవద్దంటూ ఎద్దేవా చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కౌంటర్ ఇచ్చారు. తాను కలలు కనడం లేదని, ముఖ్యమంత్రి స్టాలినే పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సేలంలో బుధవారం జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఎడప్పాడి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా అన్నాడీఎంకే ప్రభుత్వంలో అనేక పథకాలను తెచ్చామని, వాటిని అమలు చేస్తే అన్నాడీఎంకేకు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో గత 41 నెలల డీఎంకే ప్రభుత్వంలో ఆ పథకాలన్నింటినీ అటకెక్కించిదన్నారు. తనను ఒక జ్యోతిష్యుడిగా, కలలు కంటున్నట్టుగా సీఎం స్టాలిన్ పేర్కొన్నారని, నిజానికి సీఎం స్టాలినే పగటి కలలు కంటున్నారని ఈపీఎస్ ఎద్దేవా చేశారు.

నీట్‌పై తొలి సంతకం ఎక్కడ?

డీఎంకే అధికారంలోకి వచ్చిన వెంటనే నీట్ రద్దుపై తొలి సంతకం ఉంటుందని ఊకదంపుడు ప్రచారం చేశారని, ఇప్పటి డీఎంకే ప్రభుత్వం ఏర్పాటై 41 నెలలైనా ఇంకా నీట్ రద్దుపై ఎందుకు సంతకం చేయలేదని ఈపీఎస్ నిలదీశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటు బ్యాంకు క్షీణించిపోయిందని స్టాలిన్ పేర్కొన్నారని, కానీ నామక్కల్ లోక్‌సభ స్థానంలో కేవలం 30 వేల ఓట్ల తేడాతో ఓడిపోయామన్నారు. సీఎం స్టాలిన్‌తో పాటు డీఎంకే నేతలు లేనిపోని విషయాలు మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్నాడీఎంకే మళ్ళీ అధికారంలోకి వస్తుందని ఈపీఎస్ స్పష్టం చేశారు.

డెంగ్యూ మరణాలు లేని సంవత్సరం

● ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం



భవన నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సుబ్రమణ్యం

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది డెంగ్యూ మరణాలు లేని ఏడాదిగా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. రాజపాళయం ప్రభుత్వాస్పత్రిలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాల నిర్మాణాలను బుధవారం మంత్రి ఎం.సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా 19 జిల్లా ప్రధాన ఆస్పత్రులు, ముఖ్యమైన నగరాల్లో 6 ఆస్పత్రులను జిల్లా ప్రధాన ఆస్పత్రులకు ధీటుగా వసతుల కల్పనకు రూ.1,018.85 కోట్లు కేటాయించామన్నారు. ఆ ప్రకారం, విరుదునగర్ జిల్లా అరుప్పుకోటలో రూ.30 కోట్లు, రాజపాళయంలో రూ.40 కోట్లతో జిల్లా ప్రధాన ఆస్పత్రులకు ధీటుగా వసతులు, అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం డెంగ్యూ వ్యాప్తి తీవ్రంగా ఉండేదని, 2012లో 66 మంది, 1017లో 65 మంది మృతిచెందారని తెలిపారు. అనంతరం డెంగ్యూ మరణాలు తగ్గాయని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా డెంగ్యూ, సీజనల్ వ్యాధులను అదుపుచేసినట్లు తెలిపారు. మక్కల్ తేడి మరత్తువమ్ పథకం ద్వారా 1.9 కోట్ల మంది లబ్ధిపొందారని మంత్రి తెలిపారు.

రూ.28 కోట్ల లంచం

● మాజీ మంత్రి వైద్యలింగంపై ఫిర్యాదు

● ఆయన నివాసాల్లో ఈడీ అధికారుల సోదాలు



మాజీ మంత్రి వైద్యలింగం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి వైద్యలింగం గతంలో రూ.28 కోట్ల మేరకు లంచం తీసుకున్నారనే ఫిర్యాదుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దృష్టి సారించారు. మాజీ మంత్రి చట్టవ్యతిరేకంగా నగదు పరివర్తనకు పాల్పడ్డారనే ఫిర్యాదు నేపథ్యంలో బుధవారం ఒకేమారు ఈడీ అధికారులు వైద్యలింగం ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. తంజావూరు జిల్లా ఒరత్తనాడు ప్రాంతంలోని ఆయన నివాసం, చెన్నైలోని ఎమ్మెల్యేల హాస్టల్‌లో వున్న ఆయన గది, ఆయన కుమారుడి ఇల్లు తదితర ప్రాంతాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కాగా, అశోక్ నగర్‌లోని ఆయనకు చెందిన సంస్థ కార్యాలయం మూసి ఉండడంతో ఆ ప్రాంతంలో అధికారులు వేచిచూసే ధోరణితో వున్నారు. 2011-2016 సంవత్సరాల్లో మాజీ ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వంలో గృహవసతి, నగర ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రిగా వైద్యలింగం వ్యవహరించారు. పెరుంగళత్తూర్‌లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ 57.94 ఎకరాల విస్తీర్ణంలో 1,453 గృహాలతో కూడిన ప్లాట్స్ నిర్మాణానికి 2013లో సీఎండీఏ అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంది. మూడేళ్ల అనంతరం హఠాత్తుగా 2016లో అనుమతులు లభించాయి.. ఆ సమయంలో ఆ శాఖ మంత్రిగా ఉన్న వైద్యలింగంకు రూ.27.90 కోట్లు లంచంగా అందజేసినట్లు 'అర్పోర్ ఇయక్కం' తరఫున అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంలో లంచం సొమ్ము వైద్యలింగం కుమారులు ప్రభు, షణ్ముగ ప్రభు తదితరులు డైరెక్టర్లుగా ఉన్న ముత్తమ్మాళ్ సంస్థకు రుణంగా ఇచ్చారని లెక్కల్లో చూపారు. ఆ సొమ్ముతో పలు ప్రాంతాల్లో ఆస్తులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. కాగా, ఈ సంస్థ 2014 నుంచి ఒక్క రూపాయి వ్యాపారం కూడా చేయలేదని ఏసీబీ విచారణలో తేలింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ విచారణ జరిపి, మాజీ మంత్రి వైద్యలింగం, ఆయన కుమారులు ప్రభు, షణ్ముగ ప్రభు, ప్రైవేటు సంస్థకు చెందిన పన్నీర్‌సెల్వం, రమేష్ సహా 11 మందిపై 5 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం మద్దతుదారుడిగా ఉన్న ఆయన, గత శాసనసభ ఎన్నికల్లో ఒరత్తనాడు నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు బుధవారం సోదాలు చేపట్టడం గమనార్హం. తనిఖీల సందర్భంగా కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



కేంద్రమంత్రి మురుగన్‌ను సత్కరిస్తున్న వీఎల్ ఇందిరాదత్ తదితరులు

ఎఫ్‌ఎం రేడియోకు ప్రజాదరణ

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో రేడియో చాలా శక్తివంతమైన మాస్ ఔట్ రీచ్ మాధ్యమంగా కొనసాగుతోందని కేంద్ర సమాచార, బ్రాడ్ కాస్టింగ్, పార్లమెంటరీ అఫైర్స్ శాఖ మంత్రి డా.ఎల్. మురుగన్ పేర్కొన్నారు. తేనాంపేటలోని ఓ హోటల్లో బుధవారం కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ సిటీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎం రేడియో వేలం కార్యక్రమం ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరాదత్ సారథ్యంలో జరిగింది. హిందుస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లెనేస్ శాంతకుమార్, మద్రాస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాం కుమార్ శంకర్, నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సయ్యద్ మునీర్ అహ్మద్, ఎస్ఐసీసీ అధ్యక్షుడు అరుణ్ అళగప్పన్, టీసీసీ అధ్యక్షుడు చోళనాసియార్ రాజశేఖర్, కేంద్ర బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంజీవ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మురగన్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం వందరోజుల పాలనలో దేశంలో 234 సిటీల్లో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులిచ్చిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రేడియో వివిధ రూపాల్లో ఇప్పటికీ చాలా సందర్భోచితంగా ఉంటూ ప్రజలను ఆకట్టుకుంటోందని, దేశంలో రేడియో శ్రోతల సంఖ్య దాదాపు 26 కోట్లకు పైగా ఉందన్నారు. ప్రైవేటు ఎఫ్‌ఎం రేడియో సేవలను నగరాలతో పాటు మారుమూల గ్రామాలకు కూడా విస్తరింపజేయాలన్న ఉద్దేశంతో ఎఫ్‌ఎం రేడియో ఆక్షన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, ఇందులో చేరదలచిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్రం నుంచి అన్నివిధాలా సహకారం ఉంటుందన్నారు. నవంబరు 18వ తేదిలోగా ప్రైవేటు ఎఫ్‌ఎం ఛానల్ కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశముందని మంత్రి మురుగన్ తెలిపారు. ముందుగా వీఎల్ ఇందిరాదత్ మాట్లాడుతూ... రేడియో మానవాళికి శాశ్వత మిత్రుడని, ఇది భౌగోళిక సరిహద్దులు దాటి ప్రతి రంగంలోని వ్యక్తులతో సన్నిహితంగా ఉంటుందని, డిజిటల్ యుగంలో కూడా రేడియో ప్రేక్షకులతో కనెక్ట్ అవడానికి శక్తివంతమైన మీడియాగా మిగిలిపోయిందన్నారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీడియా ప్రతినిధి కేఎల్ సురేష్‌బాబు, సభ్యులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి 40 లక్షల మంది భక్తులు

● మంత్రి పీకే శేఖర్‌బాబు అంచనా ● చిదంబరం ఆలయ దీక్షితుల చర్యలు కోర్టు దృష్టికి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శేఖర్ బాబు

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే కార్తీక దీపోత్సవానికి ఈ యేడాది 40 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు రాష్ట్ర హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. ప్యారీస్‌లోని కాళికాంబాల్ ఆలయం కోసం కొత్తగా తయారు చేస్తున్న వెండి రథం నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ ఆలయానికి కొత్త రథం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఇపుడు వెండి రేకులను అమర్చుతున్నారని తెలిపారు. ఈ రథం వచ్చే యేడాది మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. గత యేడాది తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవానికి 30 లక్షల మంది భక్తులు వచ్చారని, ఈ యేడాది ఈ సంఖ్య 40 లక్షల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. వచ్చేవారందరికీ అవసరమైన ఏర్పాట్లతో పాటు సౌకర్యాలను కూడా కల్పిస్తామని వెల్లడించారు. చిదంబరం నటరాజస్వామి ఆలయంలో దీక్షితుల చర్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఆలయం తమ సొంతమనేరీతిలో ఇష్టానుసారంగా కొత్త నిర్మాణాలు కూడా చేపట్టారన్నారు. అన్ని అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఇదిలా ఉండగా గవర్నర్ ఆర్ఎన్ రవి.. తాను చేసే వ్యాఖ్యలతో మీడియా తన దృష్టిని ఆకర్షించాలన్న ధోరణితో ఆయన వ్యవహారశైలి వుందన్నారు.

ఉత్తర చెన్నైలో 28 రకాల అభివృద్ధి పనులు

ఉత్తర చెన్నై అభివృద్ధి కోసం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారన్నారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2023-24, 2024-25 సంవత్సరాల్లో 'నార్త్ చెన్నై డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' పేరుతో ఏకంగా 140 రకాల అభివృద్ధి పనులను చేపట్టినట్టు తెలిపారు. ఇందుకోసం రూ.668 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

సమాచార దర్శిని

తిరునల్వేలి-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తిరునల్వేలి-తాంబరం-తిరునల్వేలి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది.

● నెం.06603 తిరునల్వేలి-తాంబరం ఫెస్టివల్ స్పెషల్ తిరునల్వేలిలో నవంబరు 3వ తేది సాయంత్రం 4 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరు మార్గంలో నెం.06004 తాంబరం-తిరునల్వేలి ఫెస్టివల్ స్పెషల్ తాంబరంలో నవంబరు 4వ తేది మధ్యాహ్నం 2.30 బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.15 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది.

నార్త్ చెన్నై ఐటీఐలో అడ్మిషన్లు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నార్త్ చెన్నై ఐటీఐలో చేరేందుకు ఈ నెల 30వ తేదిలోపు విద్యార్థులు దరఖాస్తు సమర్పించాలి. 10, 12, డిప్లొమో పూర్తిచేసిన వారు సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, డ్రోన్ పైలెట్ తదితర ఒకటి, రెండేళ్ల శిక్షణలో చేరవచ్చు. శిక్షణా కాలంలో ప్రోత్సాహక వేతనం అందజేస్తారు. శిక్షణలో చేరేందుకు ఎలాంటి ఫీజు అవసరం లేదు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐటీఐ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చు. మరిన్ని వివరాలకు 9894194990, 9499055653 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

26 నుంచి డ్రైవర్ రహిత మెట్రో ట్రయల్ రన్

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండో విడత మెట్రో ప్రాజెక్టులో నడుపనున్న డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ ఈ నెల 26వ తేది పూందమల్లి మెట్రో యార్డ్‌లో ప్రారంభం కానుంది. మూడు నెలలు 900 మీటర్ల దూరంలో ఈ ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. అనంతరం పూందమల్లి-లైట్ హౌస్ మార్గంలో నిర్ణీత దూరం ఆరు నెలలు ట్రయల్ రన్ జరుగుతుందని అధికారులు తెలిపారు.

రైళ్లలో టపాసులు తరలిస్తే మూడేళ్ల జైలు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో టపాసులు తరలిస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తామని రైల్వే పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఆ విభాగం విడుదల చేసిన ప్రకటనలో... దీపావళి సమీపిస్తున్న తరుణంలో రైళ్లలో టపాసులు తరలింపును అడ్డుకొనేలా ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నామన్నారు.

ఆవిన్ నుంచి కొత్తరకం కుల్ఫీ

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆవిన్ పాలతో పాటు పలురకాల పాల ఉత్పత్తులు అందజేస్తుంది. ఆవిన్ తయారు చేసే ఐస్‌క్రీమ్ రకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. అదే సమయంలో కొన్ని రకాల ఐస్‌క్రీమ్‌ల ధరలు తగ్గించగా, కొన్ని రకాల ధరలు పెంచారు. ఈ విషయమై ఆవిన్ అధికారి ఒకరు మాట్లాడుతూ... ప్రస్తుతం రూ.30కి విక్రయిస్తున్న కుల్ఫీ ఐస్ ఆవిన్ పార్లర్లు, ఇతర విక్రయ కేంద్రాల్లో రూ.15కే లభిస్తుందన్నారు. పెద్దరకం కుల్ఫీ ఐస్ రూ.40 పెరుగుతుందన్నారు. 500 మి.లీ ఐస్‌క్రీమ్ రూ.100 తగ్గింపుతో లభిస్తాయని తెలిపారు. దీపావళి సందర్భంగా కొత్త స్వీటు, కారం రకాలు విక్రయించనున్నట్లు తెలిపారు.

సహకార శాఖ ఉద్యోగులకు 20 శాతం బోనస్

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న రేషన్ దుకాణాలు, చిల్లర దుకాణాలు, మెడికల్ షాపుల్లో పనిచేసే ఉద్యోగులకు 20 శాతం దీపావళి బోనస్ ప్రకటించారు. ఈ మేరకు సహకార శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్ జారీచేసిన ఉత్తర్వుల్లో... బోనస్ చట్ట పరిధిలోని రాని ప్రధాన సంఘాలు, కేంద్ర సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.3,000, ప్రాథమిక సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.2,400 గ్రాట్యుటీగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఆ ప్రకారం, 43,683 మంది ఉద్యోగులకు రూ.44.42 కోట్లు బోనస్‌గా అందజేయనుంది.

అదనపు రైళ్లను నడపండి

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు రైళ్లు నడపాలని దక్షిణ రైల్వేకు రాష్ట్ర రవాణా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ నెల 31వ తేదీ దీపావళి సందర్భంగా నగరం నుంచి సుమారు 10 లక్షల మంది సొంతూర్లకు వెళ్లనున్నారని రవాణా శాఖ అంచనా వేస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం 14 వేల ప్రత్యేక బస్సులు నడుపనుండగా, చెన్నై నుంచి మాత్రమే 11 వేల బస్సులు నడుపుతున్నారు. అదే సమయంలో రైళ్లను కూడా ఆశ్రయిస్తున్నారు. ఆ క్రమంలో అదనపు రైళ్లు నడపాలని రవాణా శాఖ దక్షిణ రైల్వేకు విజ్ఞప్తి చేసింది.

27న అన్నా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయ 45వ స్నాతకోత్సవం ఈ నెల 27వ తేది జరుగనుంది. వర్సిటీ ప్రాంగణంలోని వివేకానంద ఆడిటోరియంలో జరుగనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్, నేషనల్ అక్రిడేషన్ బోర్డు చైర్మెన్ అనీల్ సహస్రబుడే తదితరులు పాల్గొంటారని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

భారీవర్షం కురిసినా నిండని చెరువులు

● 4 టీఎంసీల నీరు సముద్రంపాలు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై 426 చ.కి.మీ విస్తీర్ణం కలిగి ఉంది. ఈ ప్రాంతంలో ఈ నెల 1 నుంచి 17వ తేది వరకు 286 మి.మీ వర్షం కురిసింది. సాధారణంగా ఈ సీజన్‌లో 91 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఈ ఏడాది సాధారణం కన్నా 214 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెల 10వ తేది వరకు మాత్రమే నగరంలో 36 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదుకాగా, సాధారణం కన్నా 36 శాతం అధికం. అలాగే, ఈ నెల 15న ఎన్నూర్ కత్తివాక్కంలో 23 సెం.మీ, తిరువిక నగర్, అంబత్తూర్, కొళత్తూర్ తదితర ప్రాంతాల్లో తలా 22 సెం.మీ, మనలిలో 20 సెం.మీ, తిరువొత్తియూర్, పుళల్ ప్రాంతాల్లో తలా 18 సెం.మీ, మాధవరంలో 17 సెం.మీ, రాయపురంలో 16 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెలలో మాత్రమే నగరంలో వర్షాలకు 4.3 టీఎంసీల నీరు లభ్యమైంది. నగర తాగునీటి అవసరాలకు ఒక నెలకు టీఎంసీ అవసరం. ఆ లెక్కన, 4 నెలల 17 రోజులకు సరిపడా నీరు ఈ వర్షాల వల్ల లభించింది. కానీ, వర్షాలతో లభ్యమైన నీరు మొత్తం సముద్రంలో కలిసింది. వర్షపు నీటిని సంరక్షించేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వాతావరణ నిపుణులు మాట్లాడుతూ... నగరంలో 2015లో సంభవించిన వరదల అనంతరం, జలాశయాల భద్రత, కొత్త జలాశయాల నిర్మాణం, వాననీటి సేకరణ తదితరాలపై అటు ప్రభుత్వం, ఇటు ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. దీంతో, స్వచ్ఛంధ సంస్థలు, కార్పొరేషన్ సంయుక్తంగా 186 చెరువులు, 16 ఆలయ కొలనులు పునరుద్ధరించారని తెలిపారు. ఈ నెల 15న కురిసిన భారీవర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయ్యాయన్నారు. కానీ, నగరంలోని పలు కొలనులు, శివారు ప్రాంతాల్లోని చెరువుల్లో నీరు చేరలేదన్నారు. ముఖ్యంగా, మాధవరం మండలం 32వ వార్డు పుత్తగరం ప్రాంతంలో కార్పొరేషన్ ఏర్పాటుచేసిన కొలనులో అడుగు నీరు కూడా చేరకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇలాంటి కొలనులకు వరద నీరు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టడంలో కార్పొరేషన్ విఫలమైందన్నారు. భవిష్యత్తులో వర్షపు నీరు కొలనులు, చెరువుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



మాధవరం మండలం పుత్తాగరంలో కార్పొరేషన్ కొలనులో అడుగులోపే ఉన్న నీరు

1న నిర్వహించాల్సిన గ్రామసభలు వాయిదా

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో నవంబరు 1వ తేది నిర్వహించాల్సిన గ్రామసభలు వాయిదాపడ్డాయి. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీ డైరెక్టర్ పొన్నయ్య ప్రకటన విడుదల చేశారు. పంచాయతీల్లో గణతంత్ర దినోత్సవం (జనవరి 26), ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22), కార్మికుల దినోత్సవం (మే 1), స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), గాంధీ జయంతి (అక్టోబరు 2), స్థానిక సంస్థల దినోత్సవం (నవంబరు 1) ఇలా ఆరు రోజులు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మార్చి 22, మే 1వ తేది గ్రామసభలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో, నవంబరు 1వ తేది గ్రామసభలు నిర్వహించనున్నట్లు ప్రకటన వెలువడింది. అదే సమయంలో, దీపావళి రోజైన ఈ నెల 31వ తేది మరుసటిరోజు నవంబరు 1వ తేది సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ప్రకటన పరిగణలోకి తీసుకొని నవంబరు 1వ తేది నిర్వహించాల్సిన గ్రామసభలు వాయిదావేసినట్లు, తదుపరి నిర్వహించే తేది త్వరలో ప్రకటిస్తామని డైరెక్టర్ పొన్నయ్య తెలిపారు.

ముగిసిన బీఎడ్ అడ్మిషన్ కౌన్సెలింగ్

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో బీఎడ్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ముగిసింది. బీఎడ్ కళాశాలల్లో తమిళం, ఆంగ్లం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా 13 పాఠ్యాంశాల్లో యూజీ బీఎడ్ కోర్సులు అందిస్తున్నారు. 7 ప్రభుత్వ కళాశాలల్లో 900 సీట్లు, 14 ఎయిడెడ్ కళాశాలల్లో 1,140 సీట్లు మొత్తం 2,040 సీట్లున్నాయి. వాటి భర్తీకి సంబంధించి ఆన్‌లైన్‌లో 3,486 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,187 మంది మాత్రమే దరఖాస్తు రుసుము చెల్లించారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదలైన నేపథ్యంలో, భారీవర్షాల కారణంగా వాయిదాపడింది. ఈ కౌన్సెలింగ్ ఈ నెల 21,22 తేదీల్లో నిర్వహించగా, ప్రభుత్వ కళాశాలల్లో 900 సీట్లు, ఎయిడెడ్ కళాశాలల్లో 600 మొత్తం 1,500 సీట్లు భర్తీఅయ్యాయి. మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

విద్యార్థినిని కిడ్నాప్ చేసిన కరాటే మాస్టర్

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరుకు చెందిన ఒక మహిళా కరాటే మాస్టర్ తన వద్ద శిక్షణ తీసుకుంటున్న ప్లస్‌టూ విద్యార్థినితో నగరం విడిచి వెళ్ళిపోయింది. దీనిపై విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన, కరాటే మాస్టర్, విద్యార్థినిని తూత్తుకుడిలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక పెరంబూరుకు చెందిన 27 యేళ్ళ మహిళ కరాటే శిక్షణ ఇస్తుంది. ఈమె వద్దకు ప్లస్‌టూ చదివే 16 యేళ్ళ విద్యార్థిని శిక్షణకు చేరింది. ఈ క్రమంలో మహిళా కరాటే మాస్టర్ ఆ విద్యార్థినితో సన్నిహితంగా మెలుగుతోంది. ఇదిలా ఉండగా కొద్ది రోజుల తర్వాత మహిళా కరాటే మాస్టర్ ఆపరేషన్ ద్వారా పురుషుడుగా మారి ఆ విద్యార్థినిని పెళ్ళి చేసుకోవాలని ప్లాన్ వేశారు. ఇందుకోసం తన సొంతూరుకు ఆ విద్యార్థిని తీసుకెళ్లింది. తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు తిరు.వి.క నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో వారిద్దరూ తూత్తుకుడిలో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3 వేల మందికి సహాయాల పంపిణీ

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే 53వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర చెన్నై జిల్లా పార్టీ నార్త్ - ఈస్ట్ విభాగం ఆధ్వర్యంలో మూడు వేల మందికి వివిధ రకాలైన సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నార్త్ - ఈస్ట్ అన్నాడీఎంకే పార్టీ విభాగం కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ ఏర్పాటుచేశారు. ఇందులో ఆ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వ హయాంలో అన్ని రకాల పన్నులను ఇష్టారాజ్యంగా పెంచేశారని ఆరోపించారు. ఆ తర్వాత అర్హులైన లబ్దిదారులకు వివిధ రకాలైన సంక్షేమ సహాయలను వారు పంపిణీ చేశారు.

బీఎస్ఎన్ఎల్ కూడా కాషాయమయమా?

● సెల్వపెరుందగై ఆగ్రహం

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను లాభాలబాట పట్టించలేని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఆ సంస్థ లోగోను కాషాయమయం చేయడం సిగ్గుచేటని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మండిపడ్డారు. తాజాగా బీఎస్ఎన్ఎల్ లోగోను కాషాయం రంగులోకి మార్చారు. ఈ అంశంపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెలికాం రంగంలో ప్రతి యేటా రూ.3.36 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. కానీ, దేశ వ్యాప్తంగా సేవలు అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఆదాయం కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమేనన్నారు. ఆరంభంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు 21 శాతం ఉండేవారని, ఇపుడు ఈ సంఖ్య 7.9 శాతానికి పడిపోయిందన్నారు. మిగిలిన 92 శాతం వినియోగదారులు ప్రైవేటు టెలికాం సంస్థలు సొంతం చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సంస్థను లాభాలబాటలో మళ్ళించలేని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... ఆ సంస్థను కాషాయికరణ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

టీవీకే తాత్కాలిక ఇన్‌చార్జి న్యాయవాదుల నియామకం

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు తాత్కాలిక ఇన్‌చార్జి న్యాయవాదులను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.బుస్సీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... టీవీకే తొలి మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపం వి.శాలైలో ఈ నెల 27వ తేది జరుగుందని తెలిపారు. ఈ మహానాడు ఏర్పాట్లకోసం ఇప్పటికే పలు కమిటీలు ఏర్పాటుచేయగా, మహానాడు పనులు పూర్తయ్యాయన్నారు. ఈ మహానాడుకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు తరలిరానున్నారని అన్నారు. కార్యకర్తలకు అవసరమైన మార్గదర్శకాలు, న్యాయసలహాలు అందించేలా, ప్రతి నియోజకవర్గానికి తాత్కాలిక ఇన్‌చార్జి న్యాయవాదులను నియమించామని, కార్యకర్తలు వారికి సహకరించి మహానాడును విజయవంతం చేయాలని బుస్సీ పిలుపునిచ్చారు.

రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్సపై స్టే

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యూట్యూబర్ ఇర్ఫాన్ వ్యవహారంలో రెయిన్ బో ఆస్పతిలో 10 రోజులు చికిత్స అందించడంపై ఆరోగ్యశాఖ స్టే విధించింది. ఆస్పత్రిలో ఇప్పటికే అనుమతించిన గర్భిణులు తప్ప, ఇతరులకు చికిత్స చేయకూడదని ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆస్పత్రికి ఆరోగ్యశాఖ రూ.50వేల జరిమానా విధించింది. ఆపరేషన్ థియేటర్‌లో ఉండగానే పాప బొడ్డు తాడును కోస్తున్న వీడియోను ఇర్ఫాన్ పోస్ట్ చేశాడు. వైద్య నిబంధనలకు విరుద్ధంగా ఇర్ఫాన్ చేసిన ఈ వీడియో పోస్ట్ వివాదాస్పదమైంది. వివాదం నేపథ్యంలో, ఇర్ఫాన్ యూట్యూబ్‌లో పోస్ట్ చేసిన వీడియో తొలగించాడు.

పుదుచ్చేరిలో వెనక్కి తగ్గిన సముద్రం

పుదుచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో సముద్రపు నీళ్ళు ఉన్నట్టుండి వెనక్కి తగ్గాయి. ఈ నెల 19వ తేదీ ఈ సముద్రతీరంలో నీలం వర్ణంలో గీత కనిపించి, స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసిన విషయం తెల్సిందే. అదేసమయంలో సముద్రపు నీరు బాగా వెనక్కి వెళ్ళింది. మంగళవారం ఉదయానికి మళ్ళీ యధాస్థితికి చేరుకోగా సాయంత్రానికి వెనక్కి వెళ్ళాయి. సముద్రపు నీరు తీరానికి దాదాపు 30 అడుగుల మేర వెనక్కి వెళ్ళాయి. ఇదే విషయంపై నిపుణులు స్పందిస్తూ, ప్రతి యేటా వాతావరణ పరిస్థితుల్లో జరిగే మార్పుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుందని వెల్లడించారు. సముద్రంలో తుఫాను ఏర్పడే సమయంలో సముద్రపు నీరు వెనక్కి వెళతాయని, ఆ సమయంలోనే సముద్రపు అలలు ఉగ్రరూపం దాల్చుతాయన్నారు. ప్రస్తుతం సముద్రంలో తుఫాను ఏర్పడినందున సముద్రపు నీరు వెనక్కి వెళ్ళిందని వారు అభిప్రాయపడ్డారు.

రూ.4.20 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాంబరం కార్పొరేషన్ 2వ మండల పరిధిలోని నాలుగు పాఠశాలల్లో రూ.4.20 కోట్లతో అదనపు భవనాలు, సీసీ కెమెరాలు, శుద్ధీకరించిన తాగునీరు తదితర వసతులు ఏర్పాటుచేయనున్నారు. ఈషా పల్లావరం ప్రాథమిక పాఠశాలు, జమీన్ పల్లావరం ప్రాథమిక పాఠశాల, జమీన్ పల్లావరం మహోన్నత పాఠశాల, కీలకట్టలై మాధ్యమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో, అదనపు తరగతి గదుల నిర్మాణం, టాయిలెట్, తాగునీరు, బల్లలు, కుర్చీలు సహా పలు వసతుల ఏర్పాటుకు రూ.4.20 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

26న అన్నాడీఎంకే బహిరంగ సభ

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఈ నెల 17వ తేది బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. కానీ, భారీవర్షాల కారణంగా బహిరంగసభను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో, కాంచీపురంలో ఈ నెల 26వ తేది బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

80 బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటుకు 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ... దరఖాస్తుల పరిశీలనతో పాటు సంబంధిత స్థలాలను అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు పరిశీలించి నివేదిక ఇచ్చిన అనంతరం దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తామని రాజ్‌కుమార్ తెలిపారు. దుకాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

రేపు ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ శిబిరంలో 8 నుంచి డిగ్రీ, వృత్తి శిక్షణా కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో విద్యార్హత సర్టిఫికెట్ల నకళ్లు, స్వీయ వివరాలతో కూడిన దరఖాస్తు, పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో అభ్యర్థులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

14 కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ రైల్వేస్టేషన్‌లో 14 కిలోల గంజాయితో ఒక యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ప్రవీణ్ రాజ్ (34) స్టేషన్‌లో గస్తీ తిరుగుతున్న రైల్వే పోలీసులను గమనించి పరారయ్యేందుకు యత్నించాడు. పోలీసులు అతడిని వెంటాడి అదుపులోకి తీసుకొని, అతని బ్యాగు తనిఖీ చేసి 14 కిలోల గంజాయి గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండో సారి వందడుగులకు చేరిన మేట్టూరు



పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు జలాశయం నీటిమట్టం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ సారిగా బుధవారం ఉదయం 100 అడుగులకు చేరుకుంది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన భారీవర్షాల కారణంగా, మేట్టూరు డ్యాం నీటిమట్టం జూలై 27వ తేది 71వ సారిగా 100 అడుగులకు చేరింది. అనంతరం నీటి రాక పెరగడంతో 30వ తేది 120 అడుగుల పూర్తిస్థాయికి చేరుకుంది. డెల్టా జిల్లాల సాగుకు నీటిని విడుదల చేస్తుండడంతో, ఆగస్టు 9వ తేది నీటిమట్టం 119 అడుగులకు తగ్గింది. డ్యాంకు నీటి రాక పెరగడంతో ఆగస్టు 12వ తేది మళ్లీ 120 అడుగులకు చేరుకుంది. దీంతో, 16 క్రస్ట్ గేట్ల ద్వారా అదనపు జలాలను దిగువకు విడుదల చేశారు. అనంతరం ఆగస్టు 21వ తేది నీటిమట్టం 119 అడుగులకు తగ్గింది. సాగు నీటికి విడుదల చేసే పరిమాణం పెంచడంతో ఈ నెల 13వ తేది డ్యాం నీటిమట్టాలు 89.26 అడుగులకు తగ్గాయి. ప్రస్తుతం కావేరి పరివాహక ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవన వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో, డ్యాంకు నీటి రాక పెరిగింది. ఈ నెల 19వ తేది డ్యాంకు వచ్చే నీరు 18,384 ఘనపుటడుగులుండగా, 20న 15,929, 21న 18,094, మంగళవారం 17,586 ఘనపుటడుగులకు నీటి రాక తగ్గింది. బుధవారం ఉదయం నీటి రాక 29,850 ఘనపుటడుగులకు పెరగడంతో, ఉదయం 8 గంటల ప్రాంతంలో డ్యాం నీటిమట్టాలు 100 అడుగులకు చేరుకున్నాయి. డెల్టా సాగుకు 8,100 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 100.01 అడుగులతో 64.85 టీఎంసీలుంది. ఈ ఏడాది రెండవ సారిగా డ్యాం నీటిమట్టం 100 అడుగులకు చేరుకుందని అధికారులు తెలిపారు.

శివగంగ జిల్లాలో 144 సెక్షన్ విధింపు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు మరుదు సోదరుల వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం నుంచి ఈ నెల 31వ తేది వరకు శివగంగ జిల్లాలో 144 సెక్షన్ విధించారు. శివగంగ జిల్లా తిరుపత్తూర్‌లోని మరుదు సోదరుల మణిమండపంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల వర్ధంతిని ప్రభుత్వ వేడుకగా నిర్వహిస్తున్నారు. అలాగే, పలు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేది కాళయార్‌కోయిల్‌లో ఉన్న ఆయన స్మారక స్థూపం వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే, రామనాథపురం జిల్లా పసుమ్‌పొన్‌లో ఈ నెల 30వ తేది ముత్తురామలింగ దేవర్ జయంతి, గురుపూజ వేడుకలు జరుగనున్నాయి. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ డోంగరే ప్రవీణ్ ఉమేజ్ సిఫారసులతో ఈ నెల 23 నుంచి 31వ తేది వరకు జిల్లాలో 144 సెక్షన్ విధిస్తూ కలెక్టర్ ఆషా అజిత్ ఉత్తర్వులు జారీచేశారు.

పరీక్ష రాస్తూ విద్యార్థిని మృతి

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థిని హఠాత్తుగా స్పృహతప్పి మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. దేవపురం ప్రాంతానికి చెందిన మురుగానందం-శాంతి దంపతుల కుమార్తె హరిణి (13) అందియూర్ ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తల్లి శాంతి కూడా అదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. వారం రోజులుగా జ్వరం కారణంగా హరిణి పాఠశాలకు వెళ్లలేదని సమాచారం. బుధవారం మ్యాథ్స్ పరీక్ష ఉండడంతో హరిణి పాఠశాలకు వెళ్లింది. తరగతిలో పరీక్ష రాస్తున్న హరిణి హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు బాలికను పాఠశాల వాహనంలో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతిచెందింది. ఈ ఘటనపై అందియూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు



వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కాట్పాడి రైల్వే వంతెన రోడ్డు సహా పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో, కాట్పాడి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోవిందస్వామి, హెడ్ కానిస్టేబుల్ కార్తి రోడ్లపై ఉన్న గుంతల్లో ఇటుకలు, మట్టి వేసి తాత్కాలికంగా సరిచేశారు. ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన వాహనచోదకులు, గుంతమయమైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాలని కార్పొరేషన్‌ను కోరారు.

మహిళతో కలసి సీఐ రూ.1.47 కోట్లు స్వాహా!

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మహిళతో కలసి రూ.1.47 కోట్లు మోసం చేసిన ఇన్‌స్పెక్టర్‌ను అధికారులు వీఆర్‌కు పంపించారు. తూత్తుకుడి జిల్లా సాతాన్‌కుళం ఇన్‌స్పెక్టర్ ఏసురాజ్ శేఖరన్, ఇంతకు ముందు నాగర్‌కోయిల్ ముత్తుకడై పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఓ కేసులో ఒక వర్గానికి మద్దతిచ్చిన సీఐ ఓ మహిళతో కలసి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి వద్ద రూ.1.47 కోట్ల మోసానికి పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఓ బాధితుడు సీఐ ఏసురాజ్ శేఖరన్‌పై కన్నియాకుమారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై తిరునల్వేలి డీఐజీ మూర్తి విచారణ జరిపి, సీఐ ఏసురాజ్ శేఖరన్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీచేశారు. త్వరలో అతనిపై సస్పెన్షన్ వేటు కూడా పడనుందని పోలీసు వర్గాల సమాచారం.

రూ.20 లక్షల విలువైన పసుపు, యాలకులు స్వాధీనం

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి నుంచి శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.20 లక్షల విలువైన పసుపు, యాలకులు సహా పలురకాల వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముళ్లకాడు ప్రాంతంలో బుధవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో క్రూ బ్రాంచ్ పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తూత్తుకుడి నుంచి వచ్చిన మినీ లారీ కోవలం సముద్రతీరంలో ఆగింది. లారీ నుంచి బస్తాలను దింపిన నలుగురు వ్యక్తులు తీరంలో ఉన్న పడవలో ఎక్కించడాన్ని పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, 30 కిలోల పసుపు బస్తాలు, 31 కిలోల యాలకులు, 300 గ్రాములతో కూడిన 59 బీడీ ఆకుల బండిళ్లు సహా పలురకాల వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... ఏరల్ మరమంగళంకు చెందిన నిషాంత్, విశ్వ, వినీత్, రాజశీలన్‌గా గుర్తించి వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కడలూరు జిల్లా టాస్మాక్ మేనేజర్ అరెస్ట్

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా టాస్మాక్ అధికారిని ఏసీబీ అరెస్ట్ చేసింది. దీపావళి పండుగ సందర్భంగా కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకుండా ఉండేందుకు రూ.25వేల లంచం ఇవ్వజూపినట్లు టాస్మాక్ మేనేజర్ సెంథిల్‌కుమార్, సహాయకుడు రాధాకృష్ణన్‌ను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు.

బాణసంచా విక్రయాలు ప్రారంభం



టపాసుల విక్రయాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కో-ఆపరేటివ్ ప్రత్యేక దుకాణంలో బుధవారం దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. దీపావళి సందర్భంగా ప్రజలకు నాణ్యమైన టపాసులు తక్కువ ధరకు అందించేలా సహకార శాఖ చర్యలు చేపట్టింది. గత ఏడాది సహకార శాఖ దుకాణంలో సుమారు రూ.85 లక్షలకు పైగా టపాసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది రూ. కోటి విక్రయాలు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పిల్లలు, పెద్దలు మెచ్చేలా టపాసులు, గిఫ్ట్ బాక్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉదయం 6 నుంచి 7 గంటలు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదొరై, జిల్లా కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ జాయింట్ రిజిస్ట్రార్, మేనేజర్ రామదాసు, జిల్లా వినియోగదారుల కో-ఆపరేటివ్ గిడ్డంగి ఉప రిజిస్ట్రార్, సెక్రటరీ శరవణన్ పాల్గొన్నారు.

16 మంది జాలర్ల అరెస్ట్

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు దాటారంటూ రామేశ్వరానికి చెందిన 16 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. నెడుందీవి సముద్రంలో చేపలు పడుతున్న జాలర్లను లంక నావికాదళం చుట్టుముట్టింది. రెండు పడవలు సహా 16 మంది జాలర్లను అరెస్ట్ చేసి, కాంగేశం హార్బర్‌కు తరలించి విచారిస్తున్నారు. జాలర్లను గురువారం జాఫ్నాలోని మత్స్యశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు సమాచారం.



రాంకీ, దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరి

ఈ జీవితమే ఓ లక్కీ

- దుల్కర్ సల్మాన్
- 'లక్కీ భాస్కర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

చిత్రజ్యోతి

ఈ జీవితమే ఓ లక్కీ అని హీరో దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' దీపావళి సందర్భంగా ఈ నెల 31వ తేదీ విడుదల కానుంది. దీనిని పురస్కరించుకుని బుధవారం నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. సీనియర్ నటుడు రాంకీ, చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి, హీరో దుల్కర్ సల్మాన్ పాల్గొన్నారు. ముందుగా రాంకీ మాట్లాడుతూ, 'నేను ముఖ్యమైన చిన్న పాత్ర పోషించాను. సస్పెన్స్ కోసం ట్రైలర్ లేదా ఇతర ప్రమోషన్ లో ఎక్కడా బహిర్గతం చేయలేదు. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించారు' అన్నారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ, 'నాకు తమిళ సినిమాలు, సంగీతం అంటే ఎంతో ఇష్టం. ధనుష్‌తో కలిసి తెరకెక్కించిన 'వాత్తి' (తెలుగులో 'సార్') చిత్రంలో విద్య అనే కామన్ సామాజిక అంశాన్ని టచ్ చేశాను. ఈ సినిమా కూడా మరో భిన్నమైన కథాంశంతో తెరకెక్కించాను. ఇందులోని పాత్ర ఫిక్షన్ అయినప్పటికీ... పలు వాస్తవిక అంశాలు ఇందులో ఉన్నాయి. ఖచ్చితంగా అన్ని భాషల ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది' అన్నారు. హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, "లక్కీ భాస్కర్' ఒక సామాన్య మధ్యతరగతి వ్యక్తి జీవితం. అతను ఎదుర్కొనే సమస్యలు తదితర వాస్తవిక అంశాలతో రూపొందించారు. లవ్, ఎమోషన్స్, యాక్షన్ ఇలా అన్ని అంశాలున్నాయి. చిత్రంలోని హీరోకు లక్ ఉందో లేదో మీరు చూసి చెప్పాలి. కానీ, నేను మాత్రం అదృష్టవంతుడినే. నాకు ఈ జీవితమే లక్కీ. నేను పుట్టిన ఇల్లు, తల్లిదండ్రులు, పలు భాషల అభిమానుల ప్రేమ.. ఇలా అన్ని విషయాల్లో లక్కీ ఫెలోనే. తెలుగు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు రావడం, అక్కడి ప్రేక్షకులు ఆదరణ, వారి ప్రేమకు కృతజ్ఞుడిని. పాన్ ఇండియా అనే పదం నాకు నచ్చదు. 'సీతారామం' చిత్రం నా కెరీర్‌లో చిరస్మరణీయమైనది. 'లక్కీ భాస్కర్' కూడా ఆ స్థాయిలో ఉంటుందని ఆశిస్తున్నట్టు' పేర్కొన్నారు. శ్రీకర మూవీస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమా నిర్మించారు. మీనాక్షి చౌదరి హీరోయిన్. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రూపొందించారు.



'పడైప్పాలి'లో ఓ దృశ్యం

యధార్థ సంఘటనలతో 'పడైప్పాలి'

సినిమా, రాజకీయ ప్రపంచంలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా చేసుకుని రూపొందిన చిత్రం 'పడైప్పాలి'. 'చెన్నై 28', 'పేరగళగన్' వంటి వందకు పైగా చిత్రాలను విజయవంతంగా పంపిణీ చేసిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ బ్రహ్మ అన్బురాజ్ తన సొంత నిర్మాణ సంస్థ ఏబీఆర్ అన్బు సినిమాస్ పతాకంపై నిర్మించారు. చిత్ర నిర్మాణంలో ఆయనకు ఇది తొలి చిత్రం. బాలాజీ జయపాలన్ దర్శకుడు. మలేసియా తమిళ సినిమా ప్రపంచంలో 20కి పైగా చిత్రాల్లో నటించిన యువరాజ్ కృష్ణస్వామి, బాలాజీ జయపాలన్ ఈ చిత్రంలో హీరోలుగా నటించారు. నటి సౌందర్య హీరోయిన్. తన తొలి చిత్రాన్ని తెరకెక్కించే యువ దర్శకుడు పరువు హత్య, సినీ, రాజకీయ ప్రపంచంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇతర పాత్రల్లో సీనియర్ నిర్మాత కె.రాజన్, దర్శకుడు శివరాజ్, కార్తికేయన్ గోవిందరాజ్, ప్రశాంత్ వర్మన్, ఏఎంఎస్ హరికృష్ణన్, ప్రియదర్శిని, డొమినిక్, ఆండ్లిన్, ధర్మరాజ్, ప్రదీప్, దయనేష్, కార్తీక్ మానస్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు బాలాజీ జయపాలన్ మాట్లాడుతూ, 'ఇప్పటివరకు ఎన్నో విజయవంతమైన చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన బ్రహ్మ అన్బురాజ్.. తొలిసారి చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టి, కొన్ని యధార్థ సంఘటనలతో సినిమా తీయడం హర్షణీయం. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. విడుదల తేదీని త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

పూర్తిస్థాయి క్రైమ్ థ్రిల్లర్‌గా

'ఇరవిల్ ఆట్టమ్ పార్'

ఆర్‌ఎస్‌వి బ్యానరుపై సేలం ఆర్.శేఖర్ నిర్మించిన చిత్రం 'ఇరవిల్ ఆట్టమ్ పార్'. పూర్తిస్థాయి క్రైమ్ థ్రిల్లర్ మూవీ. ఏ.తమిళ్ సెల్వన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. హీరోగా ఉదయ అలియాస్ ఉదయ కుమార్, రెండో హీరోగా మారా రాజేంద్రన్, కథానాయికగా గ్రేసీ నటించారు. వీరితో పాటు పరుత్తివీరన్ శరవణన్, అస్మిత, ఈశ్వరన్, పాండు, సి.ఎం.దురై ఆనంద్ తదితరులు నటించారు. సేలం, ఏర్కాడు తదితర ప్రాంతాల్లో 40 రోజులపాటు చిత్రీకరణ జరుపుకుంది. ఇప్పటికే ట్రైలర్, ఆడియో రిలీజ్ చేయగా, వాటికి మంచి స్పందన వచ్చింది. వచ్చే నెల 8వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'మహానటుడు నడిగర్ తిలగం శివాజీ గణేశన్ నటించిన 'నవరాత్రి' చిత్రంలోని 'ఇరవిల్ ఆట్టమ్.. పగలినిల్ తూక్కం' అనే పాట దొంగల తెరవెనుక జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పాటలోని 'ఇరవినిల్ ఆట్టమ్ పార్' పంక్తులను ఈ సినిమా టైటిల్‌గా ఎంచుకున్నాం. ఒక షాడో హీరో పాఠశాల విద్యార్థిని లైంగిక దాడి నేరస్థులకు వ్యతిరేకంగా, పాఠశాల విద్యార్థినులను డ్రగ్స్‌కు అలవాటు చేసే విధ్వంసక ముఠాతో హీరో పోరాటం చేస్తారు. సినిమా మొత్తం రాత్రిపూట జరుగుతుంది. అందుకే 'ఇరవినిల్ ఆట్టమ్ పార్' అనే టైటిల్ ఎంచుకున్నాం' అని పేర్కొన్నారు.


'ఇరవిల్ ఆట్టమ్ పార్'లో ఉదయ్ - గ్రేసి

'ఏంజెల్' చిత్రానికి కాల్షీట్ ఇవ్వలేదు

- డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా పిటిషన్


లొకేషన్‌లో ఉదయనిధి, పాయల్ రాజ్‌పుత్ తదితరులు

'ఏంజెల్' చిత్రానికి ఒప్పందం కుదుర్చుకుని, చిత్రీకరణ కోసం ఎనిమిది రోజుల పాటు కాల్షీట్ ఇవ్వలేదంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిపై ఓఎస్‌టీ ఫిలిమ్స్ నిర్మాత రామశరవణన్ మద్రాస్ హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు ఈ నెల 28వ తేదీన విచారించి ఉత్తర్వులిస్తామని పేర్కొంది. కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో.. 'ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఉదయనిధి హీరోగా ఉన్న సమయంలో దర్శకుడు కేఎస్ అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే చిత్రాన్ని ప్రారంభించి 2018లో షూటింగ్ మొదలు పెట్టాం. 80 శాతం షూటింగ్ పూర్తి చేసారు.. మరో 20 శాతం మాత్రమే మిగిలివుంది. మిగిలిన షూటింగ్ పూర్తి చేసేందుకు హీరో కాల్షీట్ ఇవ్వడం లేదు. ఈ కారణంగా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాను. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసేలా కాల్షీట్ ఇవ్వడంతో పాటు రూ.25 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఆదేశించాలని నిర్మాత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను తిరస్కరించాలని ఉదయనిధి తరపు అడ్వకేట్ కోర్టును కోరగా, కేవలం 8 రోజుల కాల్షీట్ ఇస్తే చిత్రీకరణ పూర్తవుతుందని, ఈ మేరకు విజ్ఞప్తి చేసినా హీరో వైపు స్పందన లేదని నిర్మాత తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు.


జలమయమైన కోవై నగర ప్రధాన రోడ్డు

కోవై, తిరుప్పూర్ జిల్లాలను ముంచెత్తిన వాన

- విద్యాసంస్థలకు సెలవు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్, తిరుప్పూర్, నీలగిరి, ఈరోడ్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. కోవైలో భారీవర్షం కారణంగా రెండు కార్లు కొట్టుకుపోయాయి. భారీ వర్షాల కారణంగా కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో బుధవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. కోవై నగరం, శివారు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచి వర్షం ప్రారంభమైంది. ముఖ్యంగా, పెరియనాయకన్‌పాళయం, కారమడై, మేట్టుపాళయం ప్రాంతాలు జలమయమయ్యాయి. పాలమలై కొండ ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. ఈ కొండల నుంచి ప్రవహించే వర్షపు నీరు పెరియనాయకన్‌పాళయం, మత్తాంపాళయం, కోట్టైపిరువు మార్గం గుండా వెళ్తుంటుంది. వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఈ కాలువ వెంబడి ఉన్న రోడ్లపై వరద నీరు చేరింది. ఆ ప్రాంతంలోని కాలువపై నాలుగడుగుల మేర వరద నీరు ప్రవహించింది. వరద ఉధృతి గమనించిన వాహనచోదకులు వంతెనపై వాహనాలు తిప్పేందుకు యత్నించగా వరద ఉధృతికి రెండు కార్లు కొట్టుకుపోయాయి. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. నగరంలో పలు ప్రాంతాల్లో విరిగిన చెట్లను అగ్నిమాపక సిబ్బంది తొలగించే పనులు చేపట్టగా, రోడ్లపై నిలిచిన నీటిని కార్పొరేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు.


కొట్టుకుపోతున్న కార్లు

సదస్సులో ముఖ్యులు



విండ్ ఎనర్జీ ట్రేడ్ ఫెయిర్‌కు విశేష స్పందన

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో బుధవారం 'విండెర్జీ ఇండియా 2024' పేరుతో ప్రారంభమైన ట్రేడ్ ఫెయిర్‌కు విశేష ఆదరణ లభించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఫెయిర్ తొలిరోజు పవన విద్యుత్‌కు సంబంధించి అత్యాధునిక సాంకేతిక ప్రదర్శనలు, వ్యూహాత్మక సహకార అవకాశాలు, వివిధ కీలక అంశాలపై చర్చ జరిగాయి. 20 దేశాల నుంచి 300 మందికి పైగా ఎగ్జిబిటర్లు ఇందులో పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ అదనపు కార్యదర్శి సుదీప్ జైన్, రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ విభాగ ముఖ్య కార్యదర్శి డాక్టర్ బీలా వెంకటేశన్ తదితరులు ఈ ఫెయిర్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

అమరావతిలో నోరూరించే ఆంధ్రా వంటకాలు

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురం కెథడ్రిల్ రోడ్డులో ఉన్న అమరావతి ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో కూడిన ఆంధ్ర టిఫిన్ రూమ్‌ను సవేరా హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ నీనా రెడ్డి బుధవారం ప్రారంభించారు. పెసరట్టు, నెయ్యి కారం దోశె, అల్లం చట్నీ, నెయ్యి పొడి మినీ ఇడ్లీ, పూతరేకులు, మామిడి కారం తదితర పచ్చళ్లు, ఆరు రకాల పొడులు ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అమరావతి హోటల్స్‌లో మాంసాహారం వంటకాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో, శాఖాహార ప్రియుల కోసం ఆంధ్ర టిఫిన్ రూమ్ ప్రారంభించినట్లు డైరెక్టర్ నివేదా రెడ్డి పేర్కొన్నారు. రూ.30 నుంచి రూ.120కి పైగా ధరల్లో ఆంధ్ర వంటకాలు విక్రయిస్తున్నట్లు ఆమె తెలిపారు. దీపావళి పండుగను ఆహ్వానించే విధంగా ప్రారంభోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు.


ఆంధ్రా టిఫిన్ రూమ్ ప్రారంభోత్సవంలో నీనా రెడ్డి, నివేదా రెడ్డి

ఎస్కేపీడీలో కుంకుమార్చనతో ముగిసిన వడయాత్తి ఉత్సవం

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ ఆదియప్ప వీధిలో ప్రసిద్ధిచెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో 9 రోజుల వడయాత్తి ఉత్సవం మంగళవారం రాత్రి కుంకుమార్చనతో ముగిసింది. ఎస్కేపీడీ చారిటీస్, మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 3న సరస్వతి అలంకారం, హంస వాహన సేవలతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవం పార్వేట నంది వాహనం ఊరేగింపుతో 12న ముగిసింది. అనంతరం 14వ తేది ప్రారంభమైన వడయాత్తి ఉత్సవం సందర్భంగా అమ్మవారికి నాలుగు రోజులు వెండి కేడెం, ఐదు రోజులు బంగారం కేడెంతో అలంకరణ పూజలు, సహస్రనామ పారాయణం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నేత్రపర్వంగా సాగింది. నవరాత్రి, వడయాత్తి ఉత్సవాలు విజయవంతం కావడానికి కారకులైన వారిని ఆలయ ధర్మకర్త కొల్లా వెంకటచంద్ర శేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, శోలేటి లోకయ్యన్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, తాతా బద్రీనాథ్‌లు ఘనంగా సత్కరించారు.


కన్యకా పరమేశ్వరి సేవలో ఎస్కేపీడీ చారిటీస్ ట్రస్టీలు


మీడియాతో మాట్లాడుతున్న యు.సుబ్బారావు - వందేభారత్‌లో స్లీపర్ కోచ్

ఏసీ వందే భారత్ స్లీపర్ కోచ్ అదరహో...

- ఐసీఎఫ్‌లో ఆవిష్కరించిన అధికారులు

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని రైలు పెట్టెల తయారీ కర్మాగారం(ఐసీఎఫ్)లో అధునాతన సౌకర్యాలతో తయారు చేసిన వందే భారత్ ఏసీ స్లీపర్ కోచ్ రైలును బుధవారం ఆవిష్కరించారు. ఈ రైలును ఆర్‌డీఎస్‌వో పరిశోధన (టెస్టింగ్) తర్వాత రైల్వే శాఖకు అప్పగించనున్నారు. ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు ఈ రైలులోని ఫీచర్లు, ఇతర సౌకర్యాలను మీడియాకు వివరించారు. కాగా, దేశంలో వందే భారత్ రైళ్ళను 2018లో అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెల్సిందే. ఈ రైళ్ళకు దేశ వ్యాప్తంగా విశేషాదరణ లభించింది. దీంతో దేశ వ్యాప్తంగా పలు మార్గాల్లో ఈ రైళ్ళను నడుపుతున్నారు. ప్రస్తుతం పగటిపూట మాత్రమే నడుస్తున్న వందేభారత్ రైళ్ళకు మంచి ఆదరణ లభించడంతో రాత్రి పూట నడిపేలా స్లీపర్ క్లాస్ ఏసీ వందేభారత్ రైళ్ళను ఐసీఎఫ్‌లో తయారు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం అన్ని బోగీలు ఏసీ సౌకర్యంతో కూడిన తొలి స్లీపర్ క్లాస్ వందే భారత్ రైలును ఆవిష్కరించారు.

1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుగనుంది. మైలాపూర్ లజ్‌లో వున్న అమరజీవి స్మారక భవనంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఉత్సవం జరుగనుంది. కమిటీ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమం అరుణ శ్రీనాధ్ ప్రార్థనా గీతంతో ప్రారంభం కానుండగా, ఏపీ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తమిళనాడు మాజీ డీజీపీ ఆర్.శేఖర్ ముఖ్య అతిథులుగా, కెన్సెస్ గ్రూపు సంస్థల సీఈవో ముత్తినేని కృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగంటి ఎరుకలయ్య విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ సభ నిర్వహించనుండగా, సభ్యులు జేఎం నాయుడు వందన సమర్పణతో ముగియనుంది. ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

చెన్నై పోర్ట్ అథారిటీ అధికారుల సేవలు ప్రశంసనీయం


'పోర్ట్ డే' వేడుకల్లో చెన్నై పోర్ట్ అథారిటీ అధికారులు

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్ ట్రస్ట్‌ను ఫ్యూచరిస్టిక్ పోర్ట్‌గా మార్చేందుకు అధికారుల కృషి, సేవలు ప్రశంసనీయమని చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్‌పర్సన్, కామరాజర్ పోర్ట్ (కేపీఎల్) ఛైర్మన్ సునీల్ పాలివాల్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 21వ తేదీ పోర్ట్ డే నిర్వహించారు. ఇందులో చెన్నై పోర్ట్ అథారిటీ డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, కేపీఎల్ ఎండీ ఐరేనీ సింథియా, చెన్నై పోర్ట్ అథారిటీ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.మురళీకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. చెన్నై పోర్ట్ అథారిటీ సెక్రటరీ ఇంద్రనీల్ హజ్రా స్వాగతోపన్యాసం చేస్తూ, చెన్నై పోర్ట్ ట్రస్ట్ చరిత్రను వివరించారు. ఛైర్‌పర్సన్ సునీల్ పాలివాల్ మాట్లాడుతూ, చెన్నై పోర్ట్ కార్యకలాపాలతో పాటు అధికారులు, సిబ్బంది, పోర్ట్ వినియోగదారులు, వాటాదారుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ పోర్టును ఫ్యూచరిస్టిక్ పోర్టుగా మార్చేందుకు అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

'నవీన్స్' బ్రాండ్ అంబాసిడర్‌గా దుషార విజయన్



అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశ్వసనీయమైన బిల్డర్‌గా గుర్తింపుపొందిన నవీన్స్ కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ నటి దుషార విజయన్‌ను నియమించారు. ఈమె 'లవ్ అరేంజ్ హోమ్స్' పేరుతో నవీన్స్ సంస్థ చేపట్టే హౌసింగ్ ప్రాజెక్టులకు ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు. ఇదే విషయంపై నవీన్స్ ఎండీ నవీన్ కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... తాము చేపట్టే ప్రాజెక్టుల ప్రచారం కోసం దుషారాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. 'ఉంగ వీడు.. లవ్వా.. అరేంజ్‌డా' అనే పేరుతో ఆమె ప్రచారం చేస్తారన్నారు.

పాలమ్ సిల్క్స్ వినూత్న డిజైన్లు


కొత్త డిజైన్ చీరలను ప్రదర్శిస్తున్న మోడళ్ళు. చిత్రంలో జయశ్రీ రవి

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వినూత్నమైన డిజైన్లను ఆవిష్కరించడంలో పాలమ్ సిల్క్స్ ఎల్లవేళలా ముందుంటుంది. ఇపుడు దీపావళి పండుగను పురస్కరించుకుని, మూడు సరికొత్త కలెక్షన్లను పరిచయం చేసింది. థ్రెడ్‌వర్క్, కల్చరల్ రిచ్ బుట్టాస్, అసాధారణమైన బాక్స్ పల్లస్ డిజైన్‌లతో తయారుచేసింది. ఇదే విషయంపై పాలమ్ సిల్క్స్ వ్యవస్థాపకుడు జయశ్రీ రవి మాట్లాడుతూ, 'మరపాచి బొమ్మలు వారసత్వ సంపదగా భావించేవారు. ఈ బొమ్మల తయారీకి ఉపయోగించే చెక్కలు ఔషధ గుణాల కారణంగా మంచి శక్తి, సువాసనను వ్యాప్తి చేస్తాయన్నారు. తాము కొత్తగా ఆవిష్కరించే చీరకు అంతటా చెట్టు బెరడు దృశ్యమాన ఆకృతి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు తెలిపారు.

ఓటమిని విజయంగా మలచుకోండి

- విద్యార్థులకు గవర్నర్ పిలుపు


గవర్నర్‌తో పట్టాలు పొందిన విద్యార్థినులు

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురయ్యే ఓటములను చూసి భయపడకుండా, వెనుకంజ వేయకుండా ఒక సవాలుగా తీసుకుని విజయం వైపు పయనించాలని విద్యార్థులకు గవర్నర్ ఆర్ఎన్ రవి పిలుపునిచ్చారు. బుధవారం దిండిగల్ జిల్లాలోని కొడైకెనాల్‌లో ఉన్న అన్నై మదర్ థెరిస్సా విశ్వవిద్యాలయం 31వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో 397 మందికి ప్రత్యక్షంగా, 6,238 మందికి యూనివర్సిటీ ద్వారా, 16 మందికి బంగారు పతకాలతో కలిసి మొత్తం 6,635 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటములను చూసి విద్యార్థులు భయపడరాదన్నారు. విజయానికి తొలి మెట్టు సమయపాలన, కఠోర శ్రమ, పట్టుదల ముఖ్యమన్నారు. తన విజయానికి తొలి కారణం తన తల్లి చెప్పిన హితోక్తులన్నారు. అందువల్ల విద్యార్థులు చదువుకునే సమయంలోనూ, విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల సూచనలు, సలహాలను స్వీకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి డిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శాంతిశ్రీ తులిపుడి పాల్గొన్నారు. కాగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖామంత్రి కోవి చెళియన్ గైర్హాజరయ్యారు.

27న 'రామాయణ కల్పవృక్షం-పద్మ శిల్పం'

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన 'విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం-పద్యశిల్పం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరుగనుంది. తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 154వ ప్రసంగ కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన విశ్రాంతాచార్యులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు ఉపన్యసించనున్నారు. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



రూ.ఐదుకు ఏం వస్తుంది

టీ తాగాలంటే కనీసం పది రూపాయలు ఖర్చు పెట్టాలి. అదే అన్న క్యాంటీన్‌లో రూ.ఐదుకి కడుపునిండా భోజనం చేయొచ్చు. వెంకటగిరిలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం నుంచి ఉదయం అల్పాహారంతో పాటు రెండు పూటలా భోజనాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో నిరుపేదలు, కూలీలు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే తాము భోజనానికి ఇంటికి వెళ్లకుండా, రూ.5కే భోజనం చేయగలుగుతున్నామని పలువురు చెప్పారు. హోటళ్లకు వెళ్లి భోజనం చేసే స్థోమతలేని వారికి అన్న క్యాంటీన్ ఆకలి తీరుస్తోంది.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

రికార్డులన్నీ ఓకేనా..!

ఇప్పుడన్ని కార్యాలయాలు డిజిటల్‌గా మారుతున్నాయి. రెవెన్యూలోనూ చాలావరకు కంప్యూటరైజ్ చేశారు. అయినా, పాత రికార్డులన్నీ కార్యాలయంలోని ఓ గదిలో భద్రంగా ఉంచారు. అలా బాలాయపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఉంచిన రికార్డులను బుధవారం కలెక్టరు వెంకటేశ్వర్ పరిశీలించారు. వర్షాలకు ఉరవడం వల్ల ఏమైనా తడిచాయా అని చూశారు.

- బాలాయపల్లి, ఆంధ్రజోతి



నేడు ప్రపంచ పోలియో నివారణ దినం



థ్యాంక్యూ బర్డ్

పోలీయోతో శారీరకంగానే కాదు మానసికంగా కూడా కుంగిపోయినవారి పాలిట ఆశాదీపంలా ఒకప్పుడు వెలిగింది తిరుపతిలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్, అండ్ రీహాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్). దేశం నలుమూలల నుంచీ నిత్యం వందలాదిమంది వైకల్యంతో ఈ ప్రాంగణంలో కనిపించేవారు. సర్జరీ, ఫిజియోథెరపీల తర్వాత కృత్రిమ కాళ్లతో నడుస్తూ ఆత్మవిశ్వాసం పెంచుకుని ఊళ్లకు వెళ్లేవారు. దేశంలో ఎక్కడి నుంచి వచ్చినా.. ఉండడానికి వసతి చూపి, తినడానికి తిండి పెట్టి, ఆపరేషన్ చేసి పంపేవారు. సకలమూ ఉచితమే ఇక్కడ. తిరుపతికి వచ్చే అనేక రైళ్లలో ఒకప్పుడు పోలీయో వల్ల వైకల్యానికి గురైన పిల్లలే కనిపించేవారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మదిలో మెదిలి తిరుపతిలో ప్రాణం పోసుకున్న ఆసుపత్రే బర్డ్. పేదల కోసం టీటీడీ ఆధ్వర్యంలో దీనిని 1985లో ప్రారంభించారు. ఈక్రమంలో 1994లో బర్డ్ ఒక ట్రస్ట్‌గా ఏర్పాటై దేశవ్యాప్త సేవలందించింది. పోలియో వాక్సిన్‌తో ప్రభుత్వాలు తీసుకున్న గట్టి చర్యల వల్ల దాదాపుగా ఇప్పుడీ వ్యాధి అంతరించింది. పదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పోలీయో కేసు బర్డ్‌కు రాలేదు. దీంతో బర్డ్ ఇతర వైద్య సేవల్లోకి విస్తరించింది. మోకీళ్లు, తుంటి మార్పిడి చికిత్సలపై దృష్టి పెట్టింది. బర్డ్‌లో ఎందరో డాక్టర్లు సేవా దృక్పథంతో సేవలందించారు. బర్డ్ అనగానే ఇద్దరి పేర్లు అందరి మదిలో మెదులుతాయి. వ్యాఘ్రేశ్వరుడు, జగదీష్‌ల సారథ్యంలో బర్డ్ సేవలు దేశవ్యాపితంగా అందాయి. ప్రపంచ పోలియో నివారణ దినం సందర్భంగా బర్డ్ వైద్యులకు నమస్కరించుకుంటూ బర్డ్ సేవలను గుర్తు చేసుకుందాం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పోలియో రోగులకు బర్డ్ సేవలు

- బర్డ్ ఆసుత్రిలో 90,589 మంది పోలియో వ్యాధిగ్రస్తులకు ఆపరేషన్లు చేశారు.
- బర్డ్ వైద్యులే దేశంలోని అనేక ప్రాంతాలకు వెళ్ల శిబిరాలు నిర్వహించి, 11448 మందికి ఆ ప్రాంతాల్లోనే ఆపరేషన్లు చేశారు.
- పోలియో స్క్రీనింగ్ శిబిరాల ద్వారా పరీక్షించిన రోగుల సంఖ్య: 83,173
- ఆపరేషన్ అవసరమని గుర్తించినది :73,539
- బర్డ్ ద్వారా బూట్లు వంటి పరికరాలు అందుకున్న రోగులు : 9466





డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు బర్డ్ తొలి డైరెక్టర్‌గా (1984-87) విశేష కృషి చేశారు. దేశవ్యాప్తంగా ఉచిత పోలియో శిబిరాలు నిర్వహించే కార్యక్రమం ఈయన ప్రారంభించారు.



డాక్టర్ జగదీష్ బర్డ్ డైరెక్టర్‌గా (1993-2019) సుదీర్ఘకాలం సేవలందించారు. దేశంలోని అనేకప్రాంతాల్లో పర్యటిస్తూ వైద్య సేవలందించేవారు. పోలియో సహా అనేక రకాల ఆపరేషన్లు దాదాపు 90 వేలు ఈయన సారథ్యంలో జరిగాయి.

- మన దేశంలో 1972లో పోలియో వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. 1985లో దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించింది.
- చివరి పోలీయో కేసులో 2011లో పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో నమోదయ్యాయి.
- 2014లో భారత్‌ను పోలియో రహితదేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

జనవరి రూ.300 దర్శన టికెట్ల కోటా విడుదల నేడు

- శ్రీవాణి టికెట్లు కూడా -

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ గురువారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికార వెబ్‌సైట్ 'తిరుమలతిరుపతిదేవస్థానమ్స్' ద్వారా విడుదల చేస్తారు. జనవరిలో 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో భక్తులు ఈ టికెట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అలాగే ఉదయం 11గంటలకు జనవరి నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు దాతల బ్రేక్ దర్శన టికెట్లను కూడా విడుదల చేయనున్నారు. రోజుకు 500 టికెట్ల చొప్పున వైకుంఠ ఏకాదశి రోజులను మినహాయించి విడుదల చేయనున్నారు.

పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై శ్రీవారి దర్శన టికెట్లు పొంది బ్లాక్‌లో విక్రయం

- అదుపులోకి తీసుకున్న టీటీడీ విజిలెన్స్ -

తిరుమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై పొందిన శ్రీవారి దర్శన టికెట్లను ఓ వ్యక్తి బ్లాక్‌లో విక్రయించాడు. వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇస్తానని చెప్పి రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది.టీటీడీ విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన మురళీ శంకర్‌రెడ్డి ఐదు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని తిరుపతిలో వుంటోన్న పుదుచ్చేరికి చెందిన పద్మనాభన్ అలియాస్ భరత్ అనే దళారీని సంప్రదించాడు.ఒక్కో బ్రేక్ టికెట్‌కు రూ.4,600 చొప్పున ఐదు టికెట్లకు రూ.23 వేలు బద్మనాభన్ వసూలు చేశాడు.మంగళవారం దర్శనానికి వచ్చిన మురళీ శంకర్‌రెడ్డికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వకుండా రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.గమనించిన విజిలెన్స్ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ విషయం వెలుగు చూసింది. మురళీ శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు నివేదికను తిరుమల టూటౌన్ పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● క్రైం కార్నర్

ఈజీ మనీ కోసం..!

- దొంగగా మారిన తమిళనాడు యువకుడి అరెస్టు
- రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో మునిగి.. చెడు వ్యసనాలకు బానిసై.. ఈజీ మనీ కోసం 20కిపైగా చోరీలకు పాల్పడిన అంతరాష్ట్ర సీరియల్ దొంగ శ్రీకాళహస్తి పోలీసులకు పట్టుబడ్డాడు. తిరుపతి జిల్లా పరిధిలోని ఐదు చోరీ కేసుల్లో నిందితుడైన ఆ తమిళనాడు యువకుడిని అరెస్టు చేసి రూ.20లక్షల చోరీ సొత్తు రికవరీ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం తెలిపిన మేరకు.. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి, పగటి వేళల్లో పలు చోరీలు జరిగాయి. ఈ కేసులను ఛేదించేందుకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. సీసీ కెమెరాలు, వేలిముద్రలు, మొబైల్ విశ్లేషణ వంటి అధునాతన పరిజ్ఞానంతో ఆ బృందం విచారణ సాగించింది. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా పోరూరు ప్రాంతానికి చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30)బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రేమ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. తమిళనాడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా విచారణలో తేలింది. గతంలో 20 చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు నిర్ధారించారు. జిల్లా పరిధిలోని శ్రీకాళహస్తి పట్టణంలో రెండు, బుచ్చినాయుడు కండ్రిగ, రేణిగుంట, తిరుచానూరు సహా ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అతడి నుంచి 220గ్రాముల బంగారు ఆభరణాలు, 2,180 గ్రాముల వెండి వస్తువులు, లాప్‌ట్యాప్, ఐఫోన్ సహా వేలిముద్రలు పడకుండా చేతులకు తొడుకునే గ్లోవ్స్, ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకున్నారు. రికవరి చేసుకున్న సొత్తు విలువ రూ.20లక్షలుగా అంచనా వేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. సులభ సంపాదన కోసం ఒకడే వెళుతూ చోరీలు చేయడంలో దిట్ట అని డీఎస్పీ తెలిపారు. ఇతడిని పట్టుకోవడంలో కృషి చేసిన శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి, బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ సుధాకర్, ఏఎస్ఐలు గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ, గంగాధరం, అరుణ్, భరత్‌ను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విహారయాత్రలో విషాదం

- ఉబ్బలమడుగులో మునిగి మనుబోలు యువకుడి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా గడిపేందుకు విహారయాత్రకు వచ్చిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఉబ్బలమడుగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన భరత్‌కుమార్(19) తన స్నేహితులతో కలిసి ఉబ్బలమడుగుకు వచ్చాడు. మడుగులో స్నానం చేస్తూ.. లోతున్న ప్రాంతానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఎంతసేపటికీ భరత్‌కుమార్ పైకి రాకపోవడంతో అతడి స్నేహితులు బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. మడుగువద్దకు చేరుకున్న పోలీసులు భరత్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీఎన్‌కండ్రిగ ఎస్ఐ విశ్వనాథం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



హత్యకు గురైన ఈశ్వరయ్య

రేణిగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లికి చెందిన ఈశ్వరయ్య(43) మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అర్బన్ సీఐ శరత్‌చంద్ర తెలిపిన ప్రకారం.. ఈశ్వరయ్యకు 15 ఏళ్ల కిందట సుజాతతో వివాహం జరిగింది. వీరికి నలుగురు పిల్లలు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో భార్యాభర్తలు హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈశ్వరయ్య మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. మంగళవారం రాత్రి మిద్దెపై భార్యాభర్తలు నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోదారంటూ పోలీసులకు సుజాత ఫిర్యాదు చేసింది. అర్బన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ హత్య ప్రదేశంలో వాసన పసిగడుతూ సుజాత వద్ద ఆగింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని రుయాస్పత్రి మార్చురికీ తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిత్రలేఖనంలో యామిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న యామిని

శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన యామిని జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. యామిని పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం 1994 - ఆడ శిశువును కాపాడుదాం సృష్టిని రక్షిద్దాం' అనే అంశంపై ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైంది. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా నలుమూలల నుంచి హాజరైన విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా యామిని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. డీఆర్వో పెంచలకిషోర్,డీఎంహెచ్‌వో శ్రీహరి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు ప్రోత్సాహక నగదు బహుమతి చెక్కును అందజేశారు.



యామిని వేసిన చిత్రం

వేద సారాంశంపై విస్తృత ప్రచారం

- విజయేంద్ర సరస్వతి



విద్యార్థులకు అనుగ్రహభాషణం చేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అన్ని విద్యల్లో వేద విద్య ఉన్నతమైనదని కంచికామ కోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుమలలోని ఎస్వీ వేద విజ్ఞానపీఠంలో బుధవారం సాయంత్రం ఆయన వేద విద్యార్థులకు అనుగ్రహ బాషణం చేశారు. ఈసందర్భంగా ఆయనకు వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ వేద విద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని చెప్పారు. ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. మనది సాధువులు, మహర్షులు నడుపుతున్నా దేశమన్నారు. ధర్మం కోసం త్యాగం చేయాలి కానీ ధర్మాన్ని త్యాగం చేయకూడదన్నారు. వేదాల్లోని భావాలు విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే భావితరాలకు మంచి జరుగుతుందన్నారు. ధర్మపరిరక్షణకు ఆహార, ఆలోచన నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులందరూ వేద విద్య పూర్తయ్యాక ధర్మానికి కార్యకర్తలుగా పనిచేసి సంస్కృత భాషను ప్రచారం చేయాలని సూచించారు. దేశానికి ధర్మం, ఆలయం, సంస్కృతి, ఆచారం ముఖ్యమని ఉపదేశించారు. ప్రతి గ్రామ ఆలయాన్ని తిరుమల ఆలయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేస్తున్న అనేక కార్యక్రమాల్లో వేద విజ్ఞాన అభివృద్ధి కార్యక్రమం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి వరకు నెలవారీ పాస్‌ల జారీ

వేళచ్చేరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) నెలవారీ బస్‌పాస్‌లు ఈ నెల 24వ తేది వరకు పొందవచ్చని రవాణా శాఖ ప్రకటించింది. ఎంటీసీ విక్రయ కేంద్రాల్లో ఈ పాస్‌లను ప్రతినెలా 20వ తేది వరకు పొందవచ్చు. కానీ, వర్షాల కారణంగా ఈ 24వ తేది వరకు నెలవారీ పాస్‌లు పొందవచ్చని అధికారులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 64,359 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



విమానాశ్రయంలో ఉపాధ్యాయులు

ఫ్యాన్స్ ఎడ్యుకేషన్ టూర్‌కు 54 మంది టీచర్లు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'డ్రీమ్ టీచర్' అవార్డు పొందిన 54 మంది ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ తరఫున ఐదు రోజుల ఫ్రాన్స్ ఎడ్యుకేషనల్ టూర్‌కి బుధవారం వెళ్లారు. అంతర్జాతీయ స్థాయిలో అనుమతించిన మార్గదర్శకాలతో పనిచేసిన డ్రీమ్ టీచర్లకు, విదేశీ సంస్కృతులు, సంప్రదాయం, విద్యా రంగం తదితరాలు తెలుసుకొని, విద్యార్థులకు తదనుగుణంగా మెరుగైన బోధన అందించేలా ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ రూపొందించింది. ఎడ్యుకేషన్ టూర్‌కు వెళుతున్న ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ అభినందించారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంటలో 10 నిమిషాల హాల్ట్

వేళచ్చేరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీల్లో నీరు నింపేందుకు వివేక్ ఎక్స్‌ప్రెస్ 10 నిమిషాలు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... నెం.22504 డిబ్రూగర్-కన్నియాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు వేకువజామున 3 గంటలకు చేరుకొని 3.10 నిమిషాలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.22503 కన్నియాకుమారి-డిబ్రూగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకొని 12.20 గంటలకు బయల్దేరి వెళుతంది.



మహిళల భద్రతే లక్ష్యం

- నగరంలో 'పింక్ ఆటో' పరిచయం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రత కల్పించేలా నగరంలో 'పింక్ ఆటో' సేవలు పరిచయం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సుశిక్షితులైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన మహిళలే నడిపే ఈ పింక్ ఆటోలు మహిళల భద్రతకు భరోసానిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మహిళలకు భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తరులతో 'పింక్ ఆటో' సేవలను రాష్ట్ర ప్రభుత్వం పరిచయం చేయనుంది. మహిళలు, బాలికలకు భద్రత కల్పిస్తూ సురక్షిత ప్రయాణం చేసేలా నగరంలో 250 పింక్ ఆటోలు నడుపనున్నారు. అలాగే, మహిళలు స్వయం ఆర్థికాభివృద్ధి, డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మహిళలకు ఉపాధి కల్పించేలా ఈ పథకం అమలుకానుంది.

ఆటో కొనుగోలుకు రూ.లక్ష సబ్సిడీ...

పింక్ ఆటో పొందేందుకు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి ఆదరణ లేని నిరుపేదమహిళలు, వితంతువులకు ప్రాధాన్యమిస్తారు. దరఖాస్తు చేసుకొనే మహిళలు నగరానికి చెందిన వారై 25 నుంచి 45 ఏళ్లలోపు కలిగి వుండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఈ పథకంలో 250 మంది మహిళల ఆటో కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీ ఇవ్వనుంది. ఆసక్తి కలిగిన మహిళలు చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సింగారవేలర్ మాలిగై, చెన్నై-1 అనే చిరునామాలో నవంబరు 23వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది.